సాక్షి రంగారెడ్డి

గురువారం । 5 । డిసెంబర్ । 2024





## భూములు లాక్కోవద్దు

అభివృద్ధి పేరిట గిరిజనుల భూములు లాక్కునేందుకు యత్నిస్తే ఊరుకునేది లేదని రాంబాల్ నాయక్ హెచ్చరించారు. 8లో ▸



## ఎఫ్‌టీఎల్ పరిశీలన

మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని చందన చెరువును బుధవారం హైడ్రా అధికారులు సందర్శించారు. 8లో ▸



## ఉద్యోగులుగా గుర్తించండి

పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న తమను ఉద్యోగులుగా గుర్తించాలని కారోబార్, బిల్ కలెక్టర్లు డిమాండ్ చేశారు. 8లో ▸

## న్యూస్‌రీల్

### 91.3 శాతం డేటా ఎంట్రీ

**25 మండలాలు, ఒక కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీల్లో సంపూర్ణం**

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, కుటుంబ, ఉపాధి, రాజకీయ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచే ప్రక్రియ జిల్లాలో దాదాపు పూర్తి కావొచ్చింది. నవంబర్ ఆరు నుంచి ఇంటింటి సర్వేను చేపట్టింది. తొలి మూడు రోజులు బ్లాక్‌ల గుర్తింపు, ఇంటింటికి తిరిగి స్టిక్కర్ల అంటించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. తొమ్మిది నుంచి 20 వరకు కుటుంబ సభ్యుల వివరాలను సేకరించిన విషయం తెలిసిందే. ఆ తర్వాతి రోజు నుంచి ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ప్రక్రియను చేపట్టింది. నవంబర్ 30లోపే డేటా ఎంట్రీ పూర్తి కావాల్సి ఉంది. కానీ జిల్లాలో సిబ్బంది కొరత తదితర కారణాలతో ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. జిల్లా వ్యాప్తంగా బుధవారం నాటికి 91.3 శాతం నమోదైంది.

**వెనుకబడిన బండ్లగూడ**

జిల్లా వ్యాప్తంగా 27 మండలాలు ఉండగా ఆమనగల్లు, కొందుర్గు మినహా మిగిలిన మండలాల్లో వందశాతం డేటా ఎంట్రీ పూర్తైంది. రూరల్ ఏరియాలో 99.99 శాతం పూర్తి కాగా, అర్బన్ ఏరియాలో 83.1 శాతం పూర్తైంది. ఇక 13 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్ల పరిధిలో పరిశీలిస్తే.. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్, శంకర్‌పల్లి, తుక్కుగూడ, శంషాబాద్ మున్సిపాలిటీల్లో వందశాతం నమోదైంది. ఇక తుర్కయాంజాల్‌లో 99.97 శాతం, పెద్ద అంబర్‌పేటలో 98.8 శాతం, ఇబ్రహీంపట్నంలో 98.7 శాతం, జల్‌పల్లిలో 94.7 శాతం, నార్సింగిలో 90.9 శాతం, షాద్‌నగర్‌లో 89.9 శాతం, బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో 85.2 శాతం, ఆదిబట్లలో 70.2 శాతం, కొత్తూరులో 67.7శాతం, మణికొండలో 58.7 శాతం, ఆమనగల్‌లో 54.7 శాతం, బండ్లగూడ కార్పొరేషన్‌లో 53.9 శాతం ఆన్‌లైన్ డేటా నమోదైంది.

**ఆన్‌లైన్‌లో నమోదు చేసిన కుటుంబాల వివరాలు ఇలా**

| ఏరియా | సర్వే చేసిన కుటుంబాలు | ఆన్‌లైన్‌లో నమోదు | శాతం |
|---|---|---|---|
| రూరల్ | 2,77,786 | 2,70,520 | 99.99 |
| అర్బన్ | 3,35747 | 2,88,233 | 83.01 |
| మొత్తం | 6,13,533 | 5,58,753 | 91.03 |

### వ్యాసరచన పోటీల్లో వైష్ణవి స్టేట్ ఫస్ట్

**సత్తాచాటిన నేదునూరు మోడల్ స్కూల్ విద్యార్థిని**

కందుకూరు: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో రంగారెడ్డి జిల్లా నేదునూరు మోడల్ స్కూల్ విద్యార్థిని చీమల వైష్ణవి సత్తా చాటింది. హైదరాబాద్‌లోని నాంపల్లి మోడల్ స్కూల్‌లో మంగళవారం 'రెన్యూవల్ ఎనర్జీ సోర్స్' అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన 91 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో వైష్ణవి ప్రథమ స్థానం దక్కించుకుంది. టెక్నికల్, హయ్యర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేన చేతుల మీదుగా బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా కందుకూరు ఎంఈఓ నర్సింహ, ప్రిన్సిపల్ విష్ణుప్రియ, స్కూల్ సిబ్బంది వైష్ణవిని అభినందించారు.



వైష్ణవికి బహుమతి అందజేస్తున్న దేవసేన

# నో కాంప్రమైజ్

'పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి నియోజకర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నా.. ఏడాది కాలంలో రోడ్ల అభివృద్ధికి పెద్దపీట వేశా. పార్టీలకతీతంగా పేదలకు న్యాయం చేస్తూ ప్రజాపాలన అందించేందుకు కృషి చేస్తున్నా' అంటున్నారు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఏడాది గడిచిన నేపథ్యంలో చేపట్టిన పనులు, భవిష్యత్ ప్రణాళికలను 'సాక్షి'తో పంచుకున్నారు.

– ఇబ్రహీంపట్నం



**నియోజకవర్గాన్ని ప్రగతిపథంలో తీసుకెళ్తా**

- రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు
- మున్సిపాలిటీలపై స్పెషల్ ఫోకస్
- ప్రైవేట్ సంస్థల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం
- 'సాక్షి'తో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**ప్రశ్న:** నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యేగా మీరు చేపట్టిన అభివృద్ధి?

**జవాబు:** నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీపడను. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ శాఖల నుంచి అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ.120కోట్లు, ఇబ్రహీంపట్నం నుంచి ఆక్టోపస్ వరకు రూ.60కోట్లు, వనస్థలిపురం నుంచి సాహెబ్‌నగర్ మీదుగా హయత్‌నగర్ వరకు రూ.16కోట్లు, సాగర్ రోడ్డు ఇంజాపూర్ నుంచి తొర్రూర్ వరకు రూ.24కోట్లు, ఇంజాపూర్ హయత్‌నగర్ మీదుగా మునగనూర్ వరకు రూ.20కోట్లు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించా.

**ప్రశ్న:** గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవంతో ఏమైనా ప్రత్యేక నిధులు తీసుకువచ్చారా?

**జవాబు:** రెండు సార్లు మలక్‌పేట నుంచి ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవంతో ఏ శాఖ నుంచి ఎలా నిధులు తీసుకురావాలో తెలుసు. ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమాభివృద్ధికి నిధులు కేటాయిస్తుంది. గత అనుభవంతో నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా.

**ప్రశ్న:** మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు వచ్చాయా?

**జవాబు:** తుర్కయంజాల్ మున్సిపాలిటీకి హెచ్‌ఎండీఏ నుంచి రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి రూ.వంద కోట్లు మంజూరు చేయించా. ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీల అభివృద్ధికి వంద కోట్ల చొప్పున నిధులు మంజూరు చేయాలని హెచ్‌ఎండీఏకు ప్రతిపాదనలు పంపించాం.

**ప్రశ్న:** రైతులు, పేదలసంక్షేమానికి ఏం చేస్తున్నారు?

**జవాబు:** ఒక్కొక్కటిగా ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నాం. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం.

**ప్రశ్న:** గత ప్రభుత్వం ప్రారంభించి వదిలేసిన పనుల పరిస్థితి?

**జవాబు:** తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాలు, డిగ్రీ కళాశాల భవనం నిర్మాణాలు త్వరలో పూర్తి చేస్తాం. హైదరాబాద్–ఇబ్రహీంపట్నం మార్గంలోని ఇందు కళాశాల వద్ద కల్వర్టు పనులు అధికారంలోకి వచ్చిన వెంటనే ఓ పనులు పూర్తయ్యాయని.. మరోవైపు త్వరలోనే పూర్తి చేస్తాం.

**ప్రశ్న:** పేదల సొంతింటి కల ఎప్పుడు నెరవేర్చుతారు?

**జవాబు:** రానున్న నాలుగేళ్లలో 20వేల ఇళ్లు నిర్మించి ఇస్తాం.

**ప్రశ్న:** అంబేడ్కర్ చౌరస్తా ట్రాఫిక్ అంతరాయంపై మీ స్పందన?

**జవాబు:** వంతెన నిర్మాణమా? యూజీడీ నిర్మాణమా అనే అంశంపై ఇంజినీర్లతో చర్చించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

**ప్రశ్న:** మంత్రివర్గంలో మీ బెర్త్‌పై చర్చలు సాగుతున్నాయి. మీరేమంటారు?

**జవాబు:** రాష్ట్ర జనాభాలో 42శాతం జనాభా జంటనగరాల్లోనే నివసిస్తుంది. కానీ ఈ జిల్లాకు మంత్రివర్గంలో చోటు లభించలేదు. ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. మంత్రివర్గ విస్తరణలో నాకు చోటు ఉంటుంది.

**ప్రశ్న:** ఉపాధి అవకాశాల కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**జవాబు:** రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థలున్నాయి. వాటిలో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాం. నా ఆదేశానుసారం ఇప్పటికే పలు కంపెనీలు జాబ్‌మేళాలు నిర్వహిస్తూ స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి.

**ప్రశ్న:** వచ్చే నాలుగేళ్లలో ఏ రంగాలకు ప్రాధాన్యత ఇస్తారు?

**జవాబు:** విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రిని ఆధునీకరిస్తాం. ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి 25 ఎకరాల స్థల సేకరణకు అన్వేషిస్తున్నాం. ఏడాదిలో చేసింది తక్కువే.. చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. అవినీతి, అక్రమాలకు తావులేకుండా, రాజకీయాలకు అతీతంగా పేదలకు న్యాయం చేస్తూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా.

# ప్రజాపాలనపై దుష్ప్రచారం

- ప్రతిపక్ష పార్టీల మాటలను జనం నమ్మొద్దు
- తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిన ఘనత బీఆర్‌ఎస్‌దే
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉంది
- ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



ఆమనగల్లులో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్ ప్రజాపాలనపై ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులోని శ్రీలక్ష్మి గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన వ్యవసాయ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధనిక రాష్ట్రంగా చెప్పుకొనే తెలంగాణను పదేళ్ల పాలనలో అప్పుల కుప్పగా మార్చిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కిందన్నారు. ఏడాది క్రితం నిరంకుశ పాలనపోయి, ఇందిరమ్మ పాలన వచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. దేశంలోని ఏరాష్ట్రంలో లేని విధంగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశామని స్పష్టంచేశారు. ఇందుకోసం రూ.21 వేల కోట్లు వెచ్చించామని చెప్పారు. కాంగ్రెస్ పాలనపై విమర్శలు చేసే స్థాయి కేటీఆర్, హరీశ్‌రావుకు లేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సంక్రాంతి నుంచి రైతు భరోసా అందించి తీరుతామని వెల్లడించారు. ధాన్యానికి మద్దతు ధర కింద క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నామని స్పష్టంచేశారు.

**వైఎస్ హయాంలోనే ప్రాజెక్టులు**

దివంగత నేత వైఎస్సార్ హయాంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు మోక్షం కలిగిందని, కోట్లాది రూపాయలతో ప్రాజెక్టుల పనులు చేపట్టి వేలాది ఎకరాలకు సాగునీరు అందించిందని మంత్రి జూపల్లి అన్నారు. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు ఏ ఒక్క ప్రాజెక్టును కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. కష్టపడే ప్రతీ కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో వంశీచందర్‌రెడ్డి తదితరులు



లారీ ప్రమాదంలో మృతి చెందిన సుజాత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న కొండా, కేఎస్ రత్నం

# 'ఆలూరు' ప్రమాదం బాధాకరం

**బాధిత కుటుంబాలకు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పరామర్శ**

చేవెళ్ల: మండల పరిధిలోని ఆలూరు వద్ద జరిగిన లారీ ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఆలూరు, నాంచేరి గ్రామాల్లో లారీ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రమాద ఘటనతో కూరగాయల విక్రయాలను అడ్డుకోవడం సరికాదని.. తాను నేషనల్ హైవే అధికారులతో, కేంద్రం పెద్దలతో మాట్లాడికి వారికి స్థలం కేటాయించాలని కోరుతానన్నారు.

**'హైదారబాద్–బీజాపూర్' ఏడాదిలోగా పూర్తి**

తాను 2014లో ఎంపీగా ఉన్నప్పుడే ఈ నేషనల్ హైవే మంజూరు చేయించానని.. ప్రస్తుతం పనులు ప్రారంభించేందుకు సైతం తానే చర్యలు తీసుకున్నాని లోక్‌సభ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చెప్పారు. ఏడాదిలోగా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఈ మార్గంలో ఎక్కువ మలుపులున్నాయని.. దీన్ని నేరుగా ఉండేలా చూడాలని ఎన్నోమార్లు అధికారులకు వినతి పత్రాలు సమర్పించానన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రోడ్డు వెంటే భూసేకరణ చేయడంతో యథావిధిగా విస్తరణకు అనుమతులు వచ్చాయన్నారు. ప్రమాదాల నివారణకు ఎక్కువ మలుపు లున్న దగ్గర వాటిని తీసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, బీజేపీ నాయకులు మల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాండురంగారెడ్డి, అనంత్‌రెడ్డి, కృష్ణ గౌడ్, శర్వలింగం, డాక్టర్ వైభవ్‌రెడ్డి, మానిక్యరెడ్డి, రవి, శ్రీనివాస్, కృష్ణారెడ్డి, శంకర్, రాములు, కుంచం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# రాచకొండ పెండింగ్!

- బీఆర్‌ఎస్ హయాంలో పథకానికి రూట్ మ్యాప్ సిద్ధం
- నిలిచిపోయిన శివన్నగూడెం ప్రాజెక్టు పనులు
- పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్
- పథకం పూర్తయితే మంచాల, ఇబ్రహీంపట్నానికి సాగు నీరు
- ఎల్బీనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం ప్రజలకు తాగు నీరు



ఆర్‌ఎల్ఐ సర్వే, రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఇరిగేషన్ శాఖ ఇంజినీర్ల బృందం(ఫైల్)

యాచారం: రాచకొండ ఎత్తిపోతల పథకం(ఆర్ఎల్ఐ)ఇప్పట్లో కార్యరూపం దాల్చే పరిస్థితులు కనిపించడం లేదు. జిల్లాలోని కరువు పీడిత ప్రాంతాలుగా పేరున్న ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల పాటు యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల పరిధిలో లక్ష ఎకరాల్లో సాగే లక్ష్యంగా 50 నుంచి 100 చెరువులు, కుంటలను కృష్ణా జలాలతో నింపాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. డిండి ప్రాజెక్టు నుంచి శివన్నగూడెం ప్రాజెక్టుకు నీటిని తరలించి అటునుంచి రాచకొండ ఎత్తిపోతల పథకం ద్వారా నిత్యం 0.10 టీఎంసీల నీటిని తరలించేలా గతంలో ఇంజనీర్ల బృందం నివేదిక తయారు చేసింది. ఈ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు స్వరూపాన్ని కేసీఆర్ సర్కార్ ఈస్కీ(ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) బృందానికి అప్పగించింది. రూట్ మ్యాప్ సర్వే, నివేదిక కోసం అప్పటి ప్రభుత్వం రూ.2.50 కోట్ల నిధులు సైతం మంజూరు చేసింది. ఈ బృందం మంచాల మండల పరిధిలోని రంగాపూర్ వద్ద సర్వే పనులను ప్రారంభించి రెండు నెలల్లోనే రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసింది.

**ప్రాజెక్టు స్వరూపం**

నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడెం వద్ద నిర్మించే బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నీటిని నాలుగు కిలోమీటర్ల గ్రావిటీ కాల్వ, 4.50 కిలోమీటర్ల టన్నెల్ ద్వారా సంస్థాన్ నారాయణపూర్ మండలం వాయిల్లపల్లి పైభాగంలో 2.20 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించి.. అక్కడి నుంచి ఎత్తిపోతల ద్వారా మంచాల మండల పరిధిలోని ఆరుట్ల శివారులో 2.62 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో రెండో రిజర్వాయర్, ఇబ్రహీంపట్నం మండలం పెద్దతుల్ల, యాచారం మండలం గునుగల్ గ్రామాల మధ్య ఒక టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యంతో మూడో రిజర్వాయర్ నిర్మించేలా ఈస్కీ తన ప్రాజెక్టు స్వరూపాన్ని ఇరిగేషన్ శాఖకు అందజేసింది. ఈ ప్రాజెక్టు రిపోర్టు, రూట్ మ్యాప్‌ను పరిశీలించిన అప్పటి ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ల బృందం గ్రావిటీ కాల్వల నిర్మాణంపై పలు సూచనలు చేసింది. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు రావడంతో రాచకొండ ఎత్తిపోతల, డిండి ప్రాజెక్టుకు ప్రస్తుతం గండి పడినట్లయింది.

**సాగు, తాగు నీరు**

ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజవర్గాల్లోని చెరువులు, కుంటలను కృష్ణా జలాలు నింపి, ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలనే గత ప్రభుత్వ ఆలోచనలను ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. రాచకొండ ఎత్తిపోతల పథకం ద్వారా పంటల సాగుతో పాటుగా మహానగర శివారు ప్రాంతాలైన ఎల్బీనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల పట్టణ పరిధిలోని ప్రజలకు తాగునీటిని సైతం సరఫరా చేసేందుకు నివేదిక తయారు చేసింది. ప్రస్తుతం శివన్నగూడెంలో ప్రాజెక్టు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కొత్త ప్రభుత్వం ఈ పథకం పేరే ఎత్తడం లేదు. రెండేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఇబ్రహీంపట్నం పెద్ద చెరువుతో పాటు గ్రామాల్లోని చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. దీంతో సాగు, తాగునీటి కష్టాలు కనిపించడం లేదు. భూగర్భజలాలకు ఇబ్బంది లేకపోవడం కూడా ఓ కారణం.

**నివేదిక ఇచ్చాం**



కేసీఆర్ సర్కార్ హయాంలో శివన్నగూడెం ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల ద్వారా ఇబ్రహీంపట్నం, మహేశ్వరంతో పాటు యాదాద్రి జిల్లా సంస్థాన్‌నారాయణపూర్ మండలంలోని లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో సర్వే చేసి, రూట్ మ్యాప్ తయారు చేశాం. ఇందుకోసం అప్పటి ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం రాచకొండ ఎత్తిపోతల పథకంపై దృష్టి సారించాలి.

– శ్యాంప్రసాద్‌రెడ్డి, రిటైర్డ్ ఇంజినీర్, ఈస్కీ మెంబర్

**ప్రభుత్వం దృష్టి పెట్టాలి**



రాచకొండ ఎత్తిపోతల పథకంపై కాంగ్రెస్ సర్కార్ దృష్టి పెట్టాలి. రాష్ట్రంలోనే అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతాలుగా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలకు పేరుంది. అందుకే శివన్నగూడెం నుంచి ఎత్తిపోతల ద్వారా చెరువులు, కుంటలు నింపేందేకు చర్యలు చేపట్టాం. కేసీఆర్‌ను ఒప్పించి సర్వే, రూట్ మ్యాప్‌నకు నిధులు మంజూరు చేయించా. ప్రస్తుత ప్రభుత్వం పనులపై దృష్టి పెట్టాలి.

– మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం




శివన్నగూడెం ప్రాజెక్టు

# మార్కెట్ కమిటీకి కొత్త సారథులు


- ఛైర్మన్‌గా గురునాథ్‌రెడ్డి, వైస్ ఛైర్మన్‌గా కరుణాకర్
- పూర్తిస్థాయి పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు
- ఎమ్మెల్యే మద్దతుదారులకు కీలక పదవులు



ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ స్వాగత తోరణం



ఛైర్మన్ గురునాథ్‌రెడ్డి



వైస్ ఛైర్మన్ కరుణాకర్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇబ్రహీంపట్నంకు చెందిన కంబాలపల్లి గురునాథ్‌రెడ్డిని రెండోసారి ఈ పదవి వరించింది. వైస్ ఛైర్మన్‌గా రాయపోల్‌కు చెందిన మంఖాల కరుణాకర్, సభ్యులుగా తుమ్మటి శ్రీశైలం అలియస్ రామరావు(పోచారం), సుబ్బురు మల్లిక (ఇబ్రహీంపట్నం), కనెమోని లింగస్వామి యాదవ్(దండుమైలారం), మొద్దు కరుణాకర్‌రెడ్డి(శేరిగూడ), దొంతరమోని రాజు (ఖానాపూర్), తాళ్ల మహేశ్(ఇబ్రహీంపట్నం), కొర్ర పాండు(బోడకొండ), సాతిరి ఎల్లయ్య(ఆరుట్ల), గులాం అక్బర్(నల్లవెల్లి), మస్కు నర్సింహ్మ(యాచారం), నెల్లి శివకుమార్(ఇబ్రహీంపట్నం), బూడిద రాఘవేందర్‌రెడ్డి(కప్పపహాడ్), ఉప్పరిగూడ పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, జిల్లా మార్కెటింగ్ అధికారి, ఇబ్రహీంపట్నం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్‌లను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. నూతన పాలకవర్గం రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతుంది.

**రెండోసారి ఛైర్మన్‌గా..**

ఉమ్మడి ఏపీ, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 11 జనవరి 2013లో గురునాథ్‌రెడ్డి మొదటిసారి ఇబ్రహీంపట్నం మార్కెట్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర విభజన అనంతరం 17 ఆగష్టు 2014 వరకు పదవిలో కొనసాగారు. తిరిగి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో రెండోసారి ఛైర్మన్ పీఠాన్ని దక్కించుకున్నారు. మార్కెట్ కమిటీ ఏర్పాటు నుంచి రెండోసారి బాధ్యతలు తీసుకున్న తొలి వ్యక్తిగా ఘనత సాధించారు. ఇదిలా ఉండగా గురునాథ్‌రెడ్డి 2007 నుంచి 2013 వరకు ఉప్పరిగూడ పీఏసీఎస్ ఛైర్మన్‌గా పనిచేశారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అనుచరులైన గురునాథ్‌రెడ్డికి ఛైర్మన్, మంఖాల కరుణాకర్‌కు వైస్ ఛైర్మన్ పదవులు దక్కాయి. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవ తేదీని ఖారు చేయాల్సివుంది.



మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

# కుల దురహంకారంతోనే ఘాతుకం

- లేడి కానిస్టేబుల్‌ది పరువు హత్యే..
- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

**ఇబ్రహీంపట్నం:** కానిస్టేబుల్ నాగమణిది ఆస్తి గొడవ కాదని, కుల దురహంకార హత్యని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు ఆరోపించారు. మండలంలోని రాయపోల్ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ నాగమణి దారుణహత్యపై కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం ఇబ్రహీంపట్నంలోని పాషానరహరి స్మారక కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. నాగమణి పరువు హత్యను.. ఆస్తి గొడవగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ఈ కేసును కులాంతర, మతాల వివాహాల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 108 కుల దురహంకార హత్యలు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుల నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా బలమైన పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. నాగమణి హత్య జరిగి రెండురోజులు దాటిన ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, బీసీ సంఘాలు ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. మతం కంటే మానవత్వం, కులం కంటే గుణం ముఖ్యమనే ఆలోచన విధానాన్ని ప్రజల్లో కలిగేలా చైతన్యం తీసుకు రావాలన్నారు. ప్రేమించిన శ్రీకాంత్‌ను 20 రోజుల క్రితం పెళ్లి చేసుకోగానే నాగమణిని హత్య చేయడం దారుణమన్నారు. నాగమణికి సంబంధించిన ఎకరా భూమిని ఆమె భర్త శ్రీకాంత్ పేరుపై చేయాలని, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ సామేల్, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుమలత, విజయ, అరుణ, వ్యకాసం జిల్లా కార్యదర్శి జగన్, మాల మహానాడు నాయకులు కృష్ణయ్య, మారయ్య, నాయకులు రఘుపతి, పురుషోత్తం, శంకర్, చరణ, తరంగ్, శ్రీకాంత్, రాజు, కిషన్, యాదగిరి, ప్రజాసంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

# బాలిక అపహరణపై పోక్సో కేసు

**కొందుర్గు:** బాలికను అపహరించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు జిల్లేడ్ చౌదరిగూడ ఎస్సై విజయ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని ఎదిరకు చెందిన లింగని రాజు(24) అదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ బాలికను ప్రేమపేరుతో మోసం చేసి గత నెల 30న తీసుకెళ్లాడు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు తెలిసిన చోట వెతికారు. ఫలితం లేకపోవడంతో బాలిక తల్లి జిల్లేడ్ చౌదరిగూడ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాలికను తీసుకెళ్లిన రాజు చౌదరిగూడలో వదిలిపెట్టి పోలీసులకు లొంగిపోయారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి బుధవారం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విజయ్ తెలిపారు.

# గిరిజనుల భూములు లాక్కోవద్దు

- లంబాడి భాషను రాజ్యాంగంలో చేర్చాలి
- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న రాంబల్‌నాయక్

**షాద్‌నగర్ రూరల్:** లంబాడీలు మాట్లాడే 'గోర్ బోలీ'ని భారత రాజ్యాంగంలో చేర్చి అధికారిక భాషగా గుర్తించాలని లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబల్‌నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అనధికారికంగా తీసుకువచ్చిన జీఓ 29తో ఎస్టీ, ఎస్సీ, బీసీ విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే జీఓ 29ని రద్దు చేసి గ్రూప్–1 ఉద్యోగాలకు నియామక నోటిఫికేషన్ వేయాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గిరిజన డిక్లరేషన్ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. పరిశ్రమలు, ఫార్మా, రోడ్ల నిర్మాణం పేరుతో గిరిజనుల భూములను తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. అభివృద్ధి పేరుతో గిరిజనులు భూములను లాక్కోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ల నియామకంలో లంబాడీలకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. పోడు భూములకు పట్టాలని ఇవ్వాలని కోరారు. ఈ నెల 22న ఎస్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేసేందుకు ప్రతి తండాకు వెళ్లి గిరిజనులను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దశరథ్‌నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చందర్‌నాయక్, తాలుకా యువజన విభాగం అధ్యక్షుడిగా సంజునాయక్, ప్రధాన కార్యదర్శిగా పరశురాం నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజన నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దశరథ్‌నాయక్

**కడ్తాల్:** లంబాడా హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కడ్తాల్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం షాద్‌నగర్‌లో జరిగిన సంఘం సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా దశరథ్‌నాయక్ రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకంపై లంబాడా నాయకులు సేవ్యానాయక్, హరిచంద్‌నాయక్, శ్రీనునాయక్, శ్రీకాంత్, జగన్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## బెదిరించి.. చైన్ స్నాచింగ్

**ఇబ్రహీంపట్నం:** బైక్‌పై వెళుతున్న వారిని బెదిరించి, మహిళ మెడపై ఉన్న బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానిక సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేసే బీఎస్‌రెడ్డి నగర్‌కు చెందిన రమేశ్ తన తోటి ఉద్యోగినితో కారులో ఇబ్రహీంపట్నం నుంచి కొహెడ వైపు వెళుతున్నారు. మార్గమధ్యలో బైక్‌పై వచ్చిన ఓ దుండగుడు వారిని వెంబడించి ఏపీఎస్ కళాశాల సమీపంలో బెదిరించి సదరు మహిళ మెడలోని 3 తులాల బంగారు గొలుసు లాక్కొని పరారైనట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ చెప్పారు.

## చిన్నారులకు గుండె పరీక్షలు

**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** ఆర్‌బీఎస్‌కే, అపోలో ఆస్పత్రి సంయుక్తంగా నిర్వహించిన వైద్య శిబిరంలో 95 మంది చిన్నారులు హృద్రోగ సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. బుధవారం డీఈఐసీ కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు. 42 మంది చిన్నారులకు సర్జరీ అవసరమని వైద్యులు నిర్ధారించారు. మిగిలిన వారికి మందులు రాసి పంపారు. చిన్నారులకు అపోలో ఆస్పత్రిలో ఉచితంగా చికిత్సలు అందజేయనున్నట్లు కార్డియాలజిస్ట్ డాక్టర్ అమల్ గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ సుధీర్, డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగిణి, జిల్లా టీకా అధికారి డాక్టర్ షీబా, అపోలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అబ్దుల్ వాసే, సీటీ సర్జన్ డాక్టర్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ట్యూషన్ చెప్తానంటూ పిలిచి..



వినయ్‌కుమార్

**ఫిలింనగర్:** ట్యూషన్ చెప్తానంటూ బాలికను తరగతి గదిలోకి పిలిచి ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు ఓ ఉపాధ్యాయుడు. ఫిలింనగర్ పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే... ఫిలింనగర్‌లోని జ్ఞానీ జైల్‌సింగ్‌నగర్ బస్తీలో ఉన్న సెయింట్ పీటర్స్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నవ్విరి వినయ్‌కుమార్(28) అదే పాఠశాలలో సాయంత్రం విద్యార్థులకు ట్యూషన్లు చెప్పేవాడు. ట్యూషన్ పేరిట మూడురోజుల క్రితం ఐదో తరగతి విద్యార్థినిని తరగతి గదిలోకి పిలిపించాడు. బాలికతోపాటు ఆమె సోదరుడు కూడా గదిలోకి రాగా కొద్దిసేపటి తర్వాత బాలుడిని బయటకు పంపించాడు. ఆ తర్వాత బాలికపై చేయి వేస్తూ అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బెదిరిపోయిన బాలిక ఏడుస్తూ ఇంటికి వెళ్లి తల్లికి విషయం చెప్పింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు బాలికను భరోసా కేంద్రానికి పంపించారు. అక్కడ కూడా టీచర్ వినయ్‌కుమార్ తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన విషయాన్ని ఆ బాలిక పోలీసుల దృష్టికి తీసుకువచ్చింది. దీంతో పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆ టీచర్‌పై కఠినచర్యలు తీసుకోవాలని స్థానిక బస్తీవాసులు పోలీసులను కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

# ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి



డీపీఓకు వినతిపత్రం అందిస్తున్న కారోబార్లు

**డీపీఓకు విజ్ఞప్తి చేసిన కారోబార్, బిల్‌కలెక్టర్లు**

**కేశంపేట:** గ్రామ పంచాయతీల్లో ఇరవై ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను ఉద్యోగులుగా గుర్తించాలని కారోబార్, బిల్ కలెక్టర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్‌కి వినతిపత్రాన్ని కారోబార్, బిల్ కలెక్టర్ల సంఘం జిల్లా సభ్యులు బుధవారం అందించారు. గతంలో గ్రామ పంచాయతీలు తీర్మానాలు చేసి కారోబార్లు, బిల్లు కలెక్టర్లుగా హోదా ఇచ్చాయని గుర్తు చేశారు. గ్రామ పంచాయతీ సాధారణ ఆదాయంలో నుంచి 30% పరిమితితో జీతాలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జీపీలు తమకు రూ.15 వేల నుంచి రూ.22 వేల వరకు మాత్రమే జీతాలు ఇస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పంచాయతీ వెబ్‌సైట్‌లో సిబ్బంది వేతన వివరాల నమోదులో బిల్ కలెక్టర్, కారోబార్ అనే ఆప్షన్ లేదని వాపోయారు. తమను మల్టీ పర్పస్ వర్కర్స్(ఎంపీడబ్ల్యూ) లేదా కంప్యూటర్ ఆపరేటర్ అనే ఆప్షన్లు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రత్యేకంగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కారోబార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు జంగయ్య, కేశంపేట మండల అధ్యక్షుడు రవి, సభ్యులు బాలరాజు, యాదయ్య, శివకుమార్, రాజేశ్, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యోగా సాధనతో మానసికోల్లాసం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మాధవన్‌జీ

**అవేర్ సంస్థల చైర్మన్ మాధవన్‌జీ**

**మహేశ్వరం:** ప్రతిఒక్కరూ యోగా, ధ్యానం అలవాటు చేసుకోవాలని అవేర్ సంస్థల చైర్మన్ మాధవన్‌జీ అన్నారు. బుధవారం ఆయన మెహబ్బత్‌నగర్‌లోని అవేర్ సంస్థలో యోగా విద్యావికాసం కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవన్‌జీ మాట్లాడుతూ.. యోగా సాధనతో మానసిక స్థితి మెరుగుపడుతుందన్నారు. శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడడంతో పాటు రక్తపోటు తగ్గుతుందన్నారు. వంద ఎకరాల విస్తీర్ణంలో ఆరోగ్య పరిరక్షణ కేంద్రాన్ని ప్రారంభించామని.. పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అవేర్ సంస్థ పనిచేస్తుందన్నారు. యోగా విద్యావికాస కేంద్రంలో పిరమిడ్ థెరపీ, సౌండ్ థెరపీ, మ్యూజిక్ థెరపీ, అరోమా థెరపీ తదితర యోగాభ్యాసాలుంటాయన్నారు. ఈ సందర్భంగా మాధవన్‌జీ అవేర్ యోగా విద్యా వికాస కేంద్రం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకుడు మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

**ఏసీపీ రంగస్వామి**



వాహనాలను తనిఖీ చేస్తున్న ఏసీపీ రంగస్వామి తదితరులు

**షాద్‌నగర్‌రూరల్:** శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ రంగస్వామి హెచ్చరించారు. సైబరాబాద్ సీపీ ఆదేశాల మేరకు ఏసీపీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పోలీసులు పట్టణంలోని కిరాణా దుకాణాలు, దాబాలు, లాడ్జీలు, మండల పరిధిలోని కమ్మదనం, బూర్గుల, సోలీపూర్ శివారులోని ఫాం హౌస్‌లలో తనిఖీలు చేపట్టారు. ఐదుగురు సీఐలు, 20 మంది ఎస్‌ఐలు సిబ్బందితో కలిసి బృందాలుగా ఏర్పడి సోదాలు చేశారు. అనంతరం ఏసీపీ రంగస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వం నిషేధించిన పదార్థాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు చర్యలు చేపడతామన్నారు. అక్రమంగా మద్యం, గుట్కాను నిల్వ చేయరాదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిబంధనలు అతిక్రమించిన పలువురిపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ విజయకుమార్, డిటెక్టివ్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు సుశీల, శరత్‌కుమార్, బల్‌రాం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# చెత్తలారీ బోల్తా.. డ్రైవర్ సజీవ దహనం

- ఓఆర్‌ఆర్‌పై రోడ్డు ప్రమాదం
- ఔటర్‌పై నుంచి సర్వీసు రోడ్డులోకి పడిన టిప్పర్

**మేడ్చల్ రూరల్:** మేడ్చల్ పరిధిలో ఔటర్ రింగు రోడ్డు పైన ఓ లారీ ప్రమాదానికి గురై సర్వీసు రోడ్డులోకి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లారీకి మంటలంటుకుని డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. పోలీసులు తెల్పిన వివరాల మేరకు భద్రాచలం జిల్లా ఇల్లందుకు చెందిన పినబోయిన సందీప్(25) కొంత కాలంగా రాంపల్లిలో నివాసం ఉంటూ జీహెచ్‌ఎంసీ చెత్తను తీసుకెళ్లే టిప్పర్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి నగరంలోని మియాపూర్ నుండి జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు చెత్త లోడుతో ఔటర్ మీదుగా బయలుదేరాడు. మార్గమధ్యలో గౌడవెల్లి వద్దకు చేరుకోగానే ప్రమాదవశాత్తు టిప్పర్ అదుపుతప్పి ఓఆర్‌ఆర్‌పై ఉన్న ఇరురోడ్ల మధ్యలోని కల్వర్టు పైనుండి కింద ఉన్న సర్వీస్ రోడ్డులోకి పడిపోయింది. వాహనం ముందు భాగం రోడ్డుపై పడగా మిగతా భాగం కల్వర్టు పిల్లర్‌కు ఆనుకొని పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా వ్యాపించాయి. దీంతో వాహనంలో ఉన్న డ్రైవర్ సందీప్ అగ్నికి ఆహుతై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మేడ్చల్ పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటన స్థలికి వెళ్లి మంటలు అదుపు చేశారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

## చందన చెరువు ఎఫ్‌టీఎల్ పరిశీలన



ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దులు పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

**మీర్‌పేట:** మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని చందన చెరువును బుధవారం హైడ్రా అధికారులు సందర్శించారు. జిల్లెలగూడకు చెందిన బండి నగేష్ యాదవ్, బైగళ్ల ఓంప్రకాశ్‌ల ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దులను పరిశీలించారు. ఈ సందర్భంగా హైడ్రా ఇన్‌స్పెక్టర్ తిరుమలేశ్ మాట్లాడుతూ.. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన కట్టడాలు, షెడ్ల వివరాలు సేకరించామని, త్వరలోనే ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి కమిషనర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెరువును సందర్శించిన వారిలో హైడ్రా అధికారి విజయ్‌కుమార్, ఆర్‌ఐ ప్రశాంతి, ఇరిగేషన్ ఏఈ జనార్దన్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది మహికాంత్ ఉన్నారు.

## యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా క్యామ రాజేశ్



**కడ్తాల్:** ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఆగస్టులో నిర్వహించిన ఆన్‌లైన్ ఓటింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికలో ఓపెన్ కేటగిరీలో మండల కేంద్రానికి చెందిన క్యామ రాజేశ్ యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం రాజేశ్ మాట్లాడుతూ.. తన ఎంపికకు సహకరించిన పార్టీ మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు.

## కళాసిగూడలో కలకలం

**ప్లాస్టిక్ కవర్‌లో అప్పుడే పుట్టిన శిశువు తల**

**రాంగోపాల్‌పేట్:** ఓ ప్లాస్టిక్ కవర్‌లో అప్పుడే పుట్టిన చిన్నారి తల మాత్రమే ఉండటం సికింద్రాబాద్ కళాసిగూడలో కలకలం సృష్టించింది. ఈ ఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరశురాం కథనం ప్రకారం చంద్ర ఆర్కేడ్ కాంప్లెక్స్ మెట్ల పక్కన ప్లాస్టిక్ కవర్‌లో ఓ శిశువు తల మాత్రమే కనిపించడంతో స్థానికులు వెంటనే మహంకాళి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి పరిశీలించగా అప్పుడే పుట్టిన శిశువుగా గుర్తించారు. ముఖంపై కుక్క గాట్లు ఉండటంతో పాటు సీసీ టీవీలో ఓ కుక్క ప్లాస్టిక్ కవర్‌ను పట్టుకుని వచ్చినట్లు దృశ్యాలు కనిపించాయి. కేసు నమోదు చేసికుని పోలీసులు విచారణ చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృత శిశువు తలను గాంధీ మార్చురీకి తరలించారు.

## కష్టపడే తత్వం ఉంటేనే అన్ని రంగాల్లో రాణింపు

**బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు**

**రాయదుర్గం:** కష్టపడే తత్వం..తల్లిదండ్రుల సహకారం ఉంటే ప్రతి ఒక్కరూ వారు ఎన్నుకున్న రంగంలో విజయం సాధిస్తారని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు అన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్ ప్రాంగణంలో బుధవారం ఒక ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఆమె..ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'సక్సెస్' అనేది నెలరోజుల్లోనే వచ్చేది కాదని, ఏళ్లపాటు కష్టపడితేనే అది సాధ్యమవుతుందన్నారు. తాను ఎన్నో విజయాలు సాధించినా అప్పుడప్పుడు ఎదురుదెబ్బలు కూడా తగిలాయని, వాటిల్లో చేసిన తప్పులను సరిదిద్దుకొని, మళ్లీ విజయాల బాట పట్టానని చెప్పారు. ఏరంగంలో నైనా రాణించాలంటే తల్లిదండ్రుల పూర్తి సహకారం, ప్రోత్సాహం ఎంతో అవసరమని సింధు స్పష్టం చేశారు. తాను బ్యాడ్మింటన్ క్రీడలో మరింత మంది సింధూలను తయారు చేయాలనే బాధ్యత తీసుకుంటున్నానని ప్రకటించారు. ఈ మేరకు వైజాగ్‌లో ప్రత్యేక బ్యాడ్మింటన్ అకాడమీని ఏర్పాటు చేస్తున్నానని చెప్పారు.

## లక్కీడ్రా కంపెనీకి మొట్టికాయ

**బహుమతికి సరిపడా డబ్బులు ఇవ్వాలని వినియోగదారుల కమిషన్ తీర్పు**

**సిటీ కోర్టులు:** లక్కీడ్రా పేరుతో జనాలను ఇబ్బందులకు గురిచేసిన ఓ కంపెనీపై హైదరాబాద్‌లోని రాష్ట్ర వినియోగదారుల కమిషన్ మండిపడింది. ఫిర్యాదుదారుడికి స్కీంలో వచ్చిన బహుమతిగానీ, సరిపడా డబ్బుగానీ చెల్లించాలని ఆదేశిస్తూ బుధవారం తీర్పు చెప్పింది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం మామిడిపల్లికి చెందిన శంకర్ శ్రీ మహాలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ లక్కీ డ్రా స్కీంలో సభ్యత్వం తీసుకున్నాడు. నెలకు రూ.1,500 చొప్పున మొత్తం 14 నెలలకు రూ.21 వేలు చెల్లించాడు. స్కీంలో జులై 2017లో ప్రథమవిజేతగా నిలిచిన శంకర్‌కు కొత్త ఆల్టో కారును అందజేస్తామని శ్రీ మహాలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ యాజమాన్యం చెప్పింది. అతడు బహుమతి గురించి ఎన్నిసార్లు అడిగినా ఆ యాజమాన్యం స్పందించకపోవడంతో నిజామాబాద్ జిల్లా వినియోగదారుల ఫోరంలో పిటిషన్ దాఖలు చేశాడు. విచారణ చేపట్టిన జిల్లా ఫోరం ఫిర్యాదుదారుడికి స్కీం పేరుతో వచ్చిన ఆల్టో కారును లేదా కారు ఖరీదు రూ.3,35,000 వడ్డీతోసహా చెల్లించాలని తీర్పు ఇచ్చింది. అయితే దీనిపై శ్రీ మహాలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ యాజమాన్యం రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌లో అప్పీల్ చేసింది. వినియోగదారుల ఫోరం ఇచ్చిన తీర్పు సరైందేనని పేర్కొంటూ రాష్ట్ర కమిషన్ అప్పీల్‌ను కొట్టివేసింది.